

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (51)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *నేనూ నా కెటలిస్టులూ*

రాలెక్ దగ్గర చేరడానికి ముందే లూయిజీ భార్యతో కలిసి యూరప్ అంతా చూసి వచ్చాడు. ఆ విశేషాలు అప్పుడప్పుడు నాతో చెప్పి, నన్ను కూడా యూరప్‌కి ఓ ట్రిప్ వేసుకోమని సలహా ఇచ్చాడు. నేనతడికి చెప్పాను- వ్యవధి తక్కువ కావడంవల్ల- నాకున్న సమయం చాలా విలువైనదనీ- దాన్ని రీసెర్చికి వాడుకోవడంలో ఉన్న తృప్తి ప్లెజర్ ట్రిప్పులో ఉండదనీ…

అప్పుడు లూయిజీ ఆశ్చర్యపడ్డాడు. సరదాలకంటే సైంటిఫిక్ పరిశోధనలకి ప్రాధాన్యమిచ్చేంత అంకితభావం నాలో ఉందనుకుని నావంక ఆరాధనాభావంతో కూడా చూశాడు.

అప్పుడర్థమైంది నాకు- నేను నన్ను ప్రాజెక్ట్ చేసుకున్న తీరు అలా ఉన్నదని!

నిజానికి నేను రీసెర్చే ప్రాణంగా బ్రతకడం లేదు. నా సరదాలు నాకున్నాయి.

ఇక్కడ అనుకోకుండా నా ప్రయోగాలు క్లిక్కయ్యాయి. వెళ్లేలోగా వీలైనంత డేటా రాబట్టాల్సిన అగత్యమూ ఉంది. లేకుంటే ఈనగాచి నక్కల పాల్జేసినట్లవుతుంది. ఆ విషయం అలాగుంచితే- డబ్బు సమస్య ఉండనే ఉంది.

లూయిజీ ఆరాధనాభావం కొంచెం మొహమాటంగా అనిపించినా, నా దృక్పథాన్ని మరింత స్పష్టంగా అతడికి వివరించే ప్రయత్నం చెయ్యలేదు. క్రమంగా నా గురించి అతడికీ తెలియకపోదులే అనిపించింది.

ఇప్పుడు శ్రీమతి ప్రతిపాదించిన యూరప్ ట్రిప్పు గురించి చెబితే- అతడికి నా గురించిన కొంత వాస్తవం గ్రహింపుకి రావచ్చు.

మర్నాడే నేనతడికి మా యూరప్ ట్రిప్పు ఆలోచన చెప్పి, ప్లానింగుకి సలహా అడిగాను.

తమకు తెలిసింది చాలా కొంచెమే కావచ్చు. ఐనా ఆ కొంచేన్నే సలహా రూపంలో ఇవ్వడానికి ఆత్రపడేవాళ్ళు లోకంలో చాలామందే ఉంటారు. అందుకని లూయిాజీ ఉత్సాహపడతాడనుకున్నాను.

నేను చెప్పింది వినగానే లూయిాజీ మొహం పాలిపోయింది, "ఆర్యూ సీరియస్" అన్నాడతడు.

అతడి ముఖంలో ఆశ్చర్యం లేదు. కలవరముంది.

అందుకు ఆశ్చర్యపడుతూనే- "యా!" అని, "అలా అడిగావేం?" అన్నాను వెంటనే.

"వెళ్లను వెళ్లను అనేవాడివి కదా- ఉన్నట్లుండి నీకీ ఆలోచన ఎలా వచ్చిందీ, ఎందుకొచ్చిందీ?" అన్నాడతడు. ఇప్పుడూ అతడి గొంతులో కుతూహలం లేదు. కలవరమే ధ్వనించింది.

అందుకు కారణం శ్రీమతి అని చెప్పడం నాకిష్టం లేదు. ఐతే ఇదివరలో నేనన్నదానికి విరుద్ధమైన నిర్ణయం కాబట్టి సంజాయిషీ ఇవ్వడం నా బాధ్యత అనిపించింది. ఆ ఇచ్చే సంజాయిషీ కూడాతిరుగులేనిదై ఉండాలి. అతణ్ణి మరో ప్రశ్న వెయ్యకుండా నిలువరించాలి.

ఇలాంటివి నాకు వెన్నతో పెట్టిన విద్య!

కొంతకాలంగా లూయిాజీ ఈ ప్రాజెక్ట్ తనకు అనుకోని భారమైనట్లు అసంతృప్తి ప్రకటిస్తున్నాడు.

రాలెక్ తనకి చెప్పిందాన్ని బట్టి- ఈ ప్రాజెక్ట్ వడ్డించిన విస్తరిలాంటిదని తననుకున్నాట్ట. అందుకని ఎంతో ఉత్సాహంగా చేరాడు.

తీరా మొదలెట్టేక చూస్తే- చాలా వర్క్ మిగిలిపోయి ఉంది. రోజూ అతడూ నేనూ కలిసి పని చేసినా రాత్రింబవళ్లు కృషి చేయాల్సి వస్తోంది. అదీ ఒకటి రెండ్రోజులు కాదు, వారాలు కాదు, నెలలపాటు పని చెయ్యాలి.

"ఇంత శ్రమ పడాల్సి ఉంటుందని అనుకోలేదు. ఇప్పటికిప్పుడు ఇంకో ప్రాజెక్ట్‌కి మారినా నా పని సులభమౌతుందేమో" అని తరచుగా గొణుక్కుంటున్నాడు లూయిాజీ.

నాకతడి తీరు నచ్చలేదు. సతాయింపులా అనిపించి, "పోనీ రాలెక్‌కి చెప్పనా- నిన్నింకో ప్రాజెక్ట్‌కి మార్చమని" అనడిగాను.

లూయిాజీ ఒప్పుకోలేదు, "నీ ప్రాజెక్ట్‌లో చేరి, ఇంకోదానికి మారి- నిన్ను చిన్నబుచ్చడం నాకిష్టం లేదు" అన్నాడు.

ఆ సమాధానమే నాకు చిన్నతనంగా అనిపించింది. అతడి భుజం తట్టి, "చూడు లూయిాజీ! ఇలాంటి మొహమాటాలుంటే జీవితంలో పైకి వెళ్లలేం. నువ్వు అనవసరంగా నాగురించి ఎక్కువ ఆలోచిస్తున్నావు. నిజానికి ఈ ప్రాజెక్టు కానీ, ఇక్కడి రీసెర్చి ఫలితాలు కానీ- నా భవిష్యత్తుని గొప్పగా మార్చుయ్యబోవడంలేదు. ఇక్కడికి రావడం, వెళ్లడమే నా కెరియర్‌కో అచీవ్‌మెంటు. ఇప్పటికే పీహెచ్‌డీని. ఉద్యోగంలో స్థిరపడ్డాను. ఇక్కడకూడా ఆశించినకంటే మంచి ఫలితం వచ్చింది. ఇప్పుడు మనం చేస్తున్నది డేటా జెనరేషన్. స్టడీ చేసేది కైనెటిక్సు. వీటివల్ల మరికొన్ని రీసెర్చి పేపర్సు రావచ్చు తప్ప అసలు ప్రాజెక్టు ఐపోయినట్లే! నీ సంగతలా కాదు. నువ్వింకా స్టూడెంటువి. నువ్వు చేస్తున్నది డిగ్రీకోసం. నీకు టైమీజ్ గోల్డ్. నువ్వు నీ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని, తొందరగా డిగ్రీ రావడానికి ప్రాజెక్ట్ మారాలని అనుకుంటే, అది నాకు చిన్నతనం ఎందుకౌతుంది? నా కారణంగా నీ డిగ్రీ ఆలస్యమైతేనే నాకు చిన్నతనం. ప్రాజెక్ట్ మారడం వల్ల నీకు కలిసొస్తే నీకంటే ఎక్కువగా నేను సంతోషిస్తాను. అందుకే రాలెక్‌తో మాట్లాడతానన్నాను" అన్నాను.

నా మాటలకి లూయిాజీ తడబడ్డాడు. "కొన్నాళ్ళుగా పరిచయం. నీ సంగతి నాకు తెలియదా? కానీ ఒకసారి ఒప్పుకున్నాక, వెనకడుగు వెయ్యడం నాకు నచ్చదు. అందులోనూ ఈ వర్క్‌కి అలవాటు పడ్డాను. టైముదేముందీ- మూణ్ణెల్లు అనుకున్నది ఆర్నెల్లు పట్టొచ్చు. మధ్యలో నిన్నొదిలెయ్యడం నాకే అసంతృప్తిగా ఉంటుంది" అన్నాడు.

అతడి మాటల్లో నాకోసం త్యాగం చేస్తున్నాడన్న భావన ఉంది. అది నా అసంతృప్తిని పెంచింది. ఇన్నాళ్ళూ నా ప్రాజెక్ట్ అతడికి డిగ్రీ తెచ్చి పెడుతోందని గర్వంగా ఫీలైనవాణ్ణి. ఇప్పుడు నాకోసం అతడు త్యాగం చేస్తున్నాననుకోవడం జీర్ణం కావడంలేదు.

అతడితో కొనసాగాలా? అతడికి విముక్తి కలిగించాలా?

నా సందిగ్ధాన్ని శ్రీమతికి చెప్పినప్పుడు, అది అవకాశంగా తీసుకుని- తను యూరప్ ట్రిప్పు ప్రతిపాదించింది.

ఇప్పుడు లూయిాజీ యూరప్ ట్రిప్పు ఆలోచన ఎందుకొచ్చిందీ అనడుగుతున్నాడు.

ఐతే నేను మాత్రం శ్రీమతి పేరు చెప్పదల్చుకోలేదు. నాకోసం త్యాగం చేస్తున్నానన్న అతడి భావనకు ప్రతిగా అతడికోసం నేను త్యాగం చేస్తున్నట్లు స్ఫురింపజేసే బదులివ్వాలి అనుకుని, "మిస్టర్ లూయిాజీ! తొందరగా డిగ్రీ వస్తుందన్న ఆశతో ఈ ప్రాజెక్టులో చేరావు. అది పొరపాటని నీకిప్పుడు అనిపిస్తోంది. నీకీ ప్రాజెక్ట్ వర్కు భారంగా మారింది. బయటపడే దారి కనిపించక సతమతమౌతున్నావు. నిజానికి నీకీ వర్కు నేను తగిలించలేదు. రాలెక్ తగిలించాడు. నిన్ను ఇందులోంచి బయటపడెయ్యమని ఆయనకి చెప్పగలను కానీ నాకది ఇష్టంలేదు. నీకు మాట రాకుండా, నీ కోరిక తీరడంకోసమే నేను యూరప్ ట్రిప్పు వేసుకోవాలనుకుంటున్నాను" అన్నాను.

లూయిాజీ ఆశ్చర్యంగా, "రెండింటికీ లంకె ఏమిటి?" అన్నాడు.

అలాంటి లంకెలు కల్పించడంలో నేను సిద్ధహస్తుణ్ణి. ప్రస్తుతానికి అది కల్పనలా కనిపించినా అందులో నిజం కూడా చాలా ఉంది. ఎందుకంటే బెర్లిన్లో అడుగెట్టేక- నేనీ ఊరు దాటి వెళ్లలేదు. ఇక కొన్ని నెలల్లో ఇండియాకి తిరిగి వెళ్లాల్సి ఉంది.

"ఆ మాట చెప్పి, నేను యూరప్ ట్రిప్పు వేసుకుంటానని చెబితే రాలెక్ అర్థం చేసుకుంటాడు. ఆ ప్రకారం ప్రాజెక్టుకి సంబంధించి నా వర్క్ విషయంలో కైనెటిక్సు స్టడీ మానేస్తానని చెబితే ఆయన కాదనడు. నా ఇన్వాల్మెంట్ లేకుండా, నీ ఒక్కడివల్లా కైనెటిక్స్ వర్క్ ముందుకెళ్లదు కాబట్టి – ఆయన నిన్ను వేరే ప్రాజెక్టుకి మార్చవచ్చు" అన్నాను.

"మరి నీ వర్క్ ఏమౌతుంది?" అన్నాడు లూయిాజీ.

"ఇందాకనే చెప్పానుగా! ఇప్పటికే నాకావాల్సిన సమాచారం అందేసింది. ఇప్పుడు మనం చేస్తున్న స్టడీస్ కేవలం నీ డిగ్రీకి ప్రాజెక్ట్ రిపోర్టు కోసం. మనం కలెక్ట్ చేస్తున్న డేటా కైనెటిక్సు కట్టడానికి. దీన్నించి మంచి పబ్లికేషన్సు వస్తాయి. నీ డిగ్రీకే కాదు, నాకూ మా లేబరేటరీలో ఇచ్చుకుందుకు మంచి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారౌతుంది. కానీ అది నాకంత ముఖ్యం కాదు" అన్నాను.

లూయిాజీ ముఖభావాలు మారాయి. "రాలెక్ ఒప్పుకుంటాడా?" అన్నాడు.

"నా దగ్గర రెండు కొత్త ప్రాజెక్టులకి ప్రపోజల్సున్నాయి. వాటి స్టడీ ఇప్పటి స్టడీ అంత కష్టం కాదు. నేను రెండ్రోజులు లైబ్రరీకి వెళ్లి కొత్త ప్రపోజల్ తయారు చేసి రాలెక్‌కి చూపించి ఒప్పిస్తాను" అన్నాను.

లూయిాజీ అప్పటికేం మాట్లాడలేదు.

ఇచ్చిన మాట ప్రకారం నేను రెండ్రోజులు లైబ్రరీలో గడిపి కొత్త ప్రాజెక్టొకటి తయారు చేశాను. అది లూయిజీకి చూపించి, "దీన్ని జర్మన్లోకి తర్జుమా చేయి. రాలెక్‌కి చూపిద్దాం" అన్నాను.

లూయిజీ ఆ ప్రపోజల్ చదివాడు. నావంక అదోలా చూసి, "నాకోసం నువ్వు చాలా శ్రమ తీసుకున్నావు. ఇంటికెళ్లకుండా ఎక్కువసేపు లైబ్రరీలో గడిపావు. బాసుల్లో నీలాంటి వాళ్లుంటారని నేనూహించలేదు" అన్నాడు.

"నేను నీకు బాసుని కాదు. కొలీగుని. అది సరే- మన బాస్ రాలెక్ దగ్గరికెప్పుడు వెడదాం" అని సరిచేశాను.

లూయిజీ నవ్వి, "రాలెక్ నీకు బాస్ కావచ్చేమో, నాకు మాత్రం నువ్వే బాసువి. ఏం మాట్లాడాలో నీతోనే మాట్లాడతాను" అన్నాడు.

అతడి నవ్వులోనూ, గొంతులోనూ ధ్వనించిన కొత్త స్నేహభావానికి ఆశ్చర్యపడుతూనే, "మరి ప్రాజెక్ట్ నానుంచి మార్చేక రాలెక్కే నీకు బాస్. ప్రాజెక్ట్ మార్చడానికి ఆయనతో మాట్లాడ్డానికి నేనొక్కణ్ణే కాదు, నువ్వూ ఉండాలి" అన్నాను.

"అది సరే! ఇంతకీ ప్రాజెక్ట్ మార్చడమెందుకూ?" అన్నాడు లూయిజీ ఏమీ ఎరగనట్లు.

"ఎందుకంటే నేను యూరప్ ట్రిప్పుతో బిజీ. మన ప్రాజెక్టు వర్కు నీ ఒక్కడివల్లా కాదు......" అని ఇంకా ఏదో అనబోతుండగా....

"నన్నిందులోకి లాగి, ఉన్నట్లుండి యూరప్ వెడతానంటే ఎలా? నేనేమైపోతాను?" అన్నాడు లూయిజీ.

అతడా మాట యథాలాపంగా అనలేదు. ఆ గొంతులో కంగారు, బెంగ ఉన్నాయి.

"నువ్వేదో ఐపోవడమేమిటి? నీకోసమే కదా, నేను యూరప్ ట్రిప్పు వేసుకునేది?" అన్నాను.

"ఒక్క నిముషం డాక్టర్ రావ్! నేను కాసేపు మాట్లాడొచ్చా?" అన్నాడు లూయిజీ.

"కాసేపే ఏం? ఎంతసేపైనా మాట్లాడొచ్చు. నీ భవిష్యత్తు నాకూ బాధ్యతే మరి!" అన్నాను.

లూయిజీ చెప్పడం మొదలెట్టాడు.

ఈ రెండ్రోజుల్లోనూ అతగాడూ లైబ్రరీకి వెళ్లేట్ట. కొత్త ప్రాజెక్ట్ కోసం కాదు. నా గురించి తెలుసుకోవడానికి.

కెమికల్ ఆబ్స్ట్రాక్ట్సులో ఇండెక్సులో నా పేరున వెదికేట్ట.

"నువ్వు సామాన్యుడివి కాదు. చాలా మంచి వర్కు చేశావు. నీతో కలిసి పని చెయ్యడం నాకు గర్వకారణం" అన్నాడు లూయిజీ.

తెల్లబోయాను.

నా గురించి నాకు తెలుసు. అప్పటికి నా రీసెర్చి పబ్లికేషన్సు కొన్ని ఇంటర్నేషనల్ జర్నల్సులో వచ్చిన మాట నిజమే ఐనా- అవి చూసి నాతో కలిసి వర్కు చెయ్యడం గర్వకారణమనుకునేటంత విశేషమైనవి కాదు.

లూయిజీ నన్ను ఉబ్బెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్లు గ్రహించాను. కానీ ఏమనాలి?

తర్వాత అతడు మాట్లాడిందాన్నిబట్టి, లూయిజీ ఆంతర్యం నాకు అర్థమైంది.

అంతకాలం అతడు నా పని తను చేస్తున్నానని అనుకున్నాడు.

నేను వర్కు ఆపేసి- యూరప్ వెడతానని అనగానే- అర్థమయిందతడికి- అతడి వర్క్ నేను చేస్తున్నానని!

మా వర్క్ పూర్తయితే నాకో పేపరు రావచ్చు. లూయిజీకి డిగ్రీ వస్తుంది.

అలాంటప్పుడు సాధారణంగా పనంతా అతడిమీదే పడిపోవాలి. మరి నేనా భారాన్ని సగంకంటే ఎక్కువే మోస్తున్నాను.

నేను యూరప్ వెడతానని అనగానే, లూయిజీ వాస్తవంలోకి వచ్చాడు. తనకి నేనెంత అవసరమో గుర్తించాడు.

లూయిజీలో వచ్చిన ఈ మార్పు నాకు సంతోషం కలిగించింది. ఐనా తటపటాయిస్తూ, “బాగా ఆలోచించు. ప్రాజెక్ట్ మారితే ఇప్పుడున్న వర్క్‌లోడ్ బాగా తగ్గుతుందేమో!” అన్నాను.

“నువ్వు కొత్త ప్రాజెక్ట్ ప్రపోజల్ తేగానే అర్థమైంది నాకు- వర్క్‌లోడ్ గురించి నేనన్నది సిల్లీగా ఉందని! ఫర్దర్ డిస్కషనొద్దు. ఇప్పుడీ ప్రాజెక్ట్ నీ ఒక్కడిదే కాదు. నాదీను. ఇద్దరం కలిసి పని చేసినా, నువ్వు ఇండియా వెళ్లే సమయానికి- మన ప్రాజెక్టులో ఇంకా కొంత వర్క్ ఉండిపోతుందని! అది పూర్తి చెయ్యడం కూడా నా బాధ్యతగా భావిస్తాను” అన్నాడు లూయిజీ.

అతడన్నది సిల్లీగా ఉన్నదని నాకెప్పుడో తెలుసు.

ఇక్కడికి తీసుకొచ్చిన ప్రాజెక్టుకి ఆధారం నా పీహెచ్‌డీ థీసిస్. ఈ ప్రాజెక్టుకోసం ఇండియాలో కొంత బేసిక్ వర్క్ చేశాను. ఇక్కడికొచ్చి మరికొంత చేసి శాంపుల్స్ తయారు చేశాను.

వాటిని స్టడీ చేసే దశలో లూయిజీ నాతో కలిసాడు. అంటే అప్పటికి అతడికి సుమారు ఏణ్ణర్థం టైం కలిసొచ్చింది.

కొత్తగా ప్రాజెక్ట్ తీసుకుంటే కథ మొదటికొస్తుంది.

శాంపుల్ స్టడీ దశకి రావడానికి ఎన్నాళ్లు పడుతుందో తెలియదు. అసలు స్టడీకి శాంపుల్స్ వస్తాయన్న గ్యారంటీ కూడా లేదు.

నా ప్రాజెక్ట్ విషయానికొస్తే- అది వడ్డించిన విస్తరి. అందుకే రాలెక్- లూయిజీని నాతో కలిపాడు.

ఆ విషయం లూయిజీకి ఇప్పటికి అర్థమైంది.

“ఐతే మా యూరప్ ట్రిప్పు కాన్సిల్ చెయ్యాలేమో! కానీ నా శ్రీమతి ఒప్పుకుంటుందో లేదో” అన్నాను సాలోచనగా.

“డాక్టర్ రావ్! నువ్వు వెరీ టాలెంటెడ్! యూరప్ ట్రిప్పుకి నీకు మళ్లీ మళ్లీ అవకాశాలొస్తాయి. రావాలని నేను కూడా అల్లాని ప్రార్థిస్తాను. నా డిగ్రీకి మాత్రం నీ అవసరం చాలా ఉంది”

నవ్వొచ్చింది. నా ప్రగతికి అల్లా సాయం చెయ్యడం – సెక్యులరిజానికి గొప్ప ఉదాహరణ.

“నా ఫ్యూచర్ గురించి కాదు కానీ- నా శ్రీమతి ఒప్పుకోవాలని ప్రార్థిస్తే ప్రార్థించు అల్లాని” అన్నాను.

“దానికి అల్లాని ప్రార్థించడమెందుకు? నేనే నీ శ్రీమతిని వేడుకుంటాను” అన్నాడు లూయిజీ.

ఆ మాట నిజాయితీగా అన్నాడతడు. అప్పుడతడి మొహం చూస్తే జాలేసింది. ఎలాగైనా శ్రీమతిని ఒప్పించాలనిపించింది. కానీ ఎలా?

సాయంత్రం ఇంటికెళ్లేక జరిగింది ఆమెకి చెప్పాను.

శ్రీమతి మొహం గంభీరంగా ఐపోయింది, మీరెప్పుడూ ఇంతే! ఏదీ దూరమాలోచించరు” అంది.

ఆమె వివరణ తార్కికంగా ఉంది.

‘యూరప్పంతా ఒక్కలాగే ఉంటుంది, ఒక్క సిటీ చూస్తే అన్నీ అలాగే ఉంటాయి’ అని సరిపెట్టుకుని, యూరప్ ట్రిప్పుని ఎప్పుడో పక్కన పెట్టేశామంటే కారణం- ఆర్థిక ప్రయోజనాలు.

“ఇప్పుడు లూయిజీ ప్రాజెక్ట్ మారి ఉంటే- ఏంచేసేవారు? నిజంగానే యూరప్ ట్రిప్పు వేసేవారా?” అందామె.

అంటే ఆమెకి నేనీ ట్రిప్పు వేస్తానని నమ్మకం లేదు.

ఇప్పుడు లూయిజీ నన్ను బ్రతిమాలిన విషయం కూడా నమ్మినట్లు లేదు.

మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ఎంత నమ్మకమున్నా- అప్పుడప్పుడు అనుమానించుకుంటూనూ ఉంటాం.

ట్రిప్పు ఎగెయ్యడానికి నేనిప్పుడు లూయిజీ వంక పెడుతున్నానని ఆమె అనుకుంటోందని ఇప్పుడు నాలో అనుమానం పుట్టింది. అందుకని, "నీ సరదా కంటే ఇంకేవీ నాకు ముఖ్యం కాదు. నువ్వు అనగానే నేను యూరప్ ట్రిప్పుకి కన్విన్సయ్యాను. ఐతే లూయిజీ ప్లేటు ఫిరాయిస్తాడని నేనూహించలేదు. ఐనా అంతమాత్రాన అతడికోసం- మన ట్రిప్పు కేన్సిల్ చెయ్యాలనేం లేదు. అతడి ఫ్యూచర్ కోసం- నా ప్రాణానికి ప్రాణమైన నిన్ను నిరుత్సాహపర్చలేను" అన్నాను.

శ్రీమతి నవ్వి, "నాకు నిరుత్సాహమెందుకు? నేనేమైనా యూరప్ ట్రిప్పు గురించి కలలు కంటున్నానా, ఆశ పడుతున్నానా! మనమొకసారి అనుకున్నాక, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అదీ నా పోలసీ" అంది.

"అలాంటప్పుడు మరి నువ్వే ట్రిప్పు ఎందుకు ప్రపోజ్ చేశావు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఎందుకంటే- మీరు తనకెంత అవసరమో లూయిజీకి తెలిసి రావాలని! అనుకున్నట్లే జరిగిందిగా- మనకిక మళ్లీ బెర్లినే యూరప్!" అంది శ్రీమతి నవ్వుతూ.

"అంటే, ఇలా జరుగుతుందని ముందే ఊహించావా?" అన్నాను మరింత ఆశ్చర్యంగా.

"ఇందులో ఊహించడానికేముంది? మా చుట్టాల్నించి నేర్చుకున్నది చాలదూ!" అందామె.

శ్రీమతిది గొప్ప పరిశీలన.

ఆమె చుట్టాల్లో ఇద్దరి గురించి తరచుగా చెప్పేది నాకు.

ఒకాయనున్నాడు. మంచి మనసు. ఎదుటివాళ్లని ఇట్టే నమ్మేస్తాడు. ఎదుటివాళ్ల కష్టాలకు ఇట్టే కరిగిపోతాడు. వాళ్లని ఆదుకుందుకు తనవద్ద లేకపోతే, ఇతరులనుంచి కూడా అప్పు చేస్తాడు. ఇంతా చేసి, తనేదో పరోపకారం చేశానని అనుకోడు. 'నీకు సాయపడే అదృష్టం నాకొచ్చింది' అంటాడు వినయంగా.

మరొకాయనున్నాడు. ఎంగిలి చేత్తో కాకిని కూడా కొట్టడు. కానీ పోస్టాఫీసులోనో బ్యాంకులోనో ఎవరికైనా సంతకానికి అవసరమైతే, క్యాప్ తీసి పెన్నిస్తాడు.మళ్లీ వెనక్కిచ్చేదాకా వాళ్ల పీకెలమీద కూర్చుంటాడు. "ఆ సమయంలో నేను పెన్నివ్వకపోతే, వాళ్లకి పెన్నిధి పోయేది" అని తన ఔదార్యం గురించి చిలవలూ పలవలూ అల్లి ప్రచారం చేసుకుంటాడు.

మొదటాయన్ని అప్పు తీసుకున్నవాళ్లు కూడా చిన్నచూపు చూస్తారు. రెండో ఆయన్ని అప్పడిగి భంగపడ్డవాళ్లు కూడా- పొగడ్తలతో ఆకాశాని కెత్తేస్తుంటారు.

"వినయం, మర్యాద అందరికీ అర్థం కాదు. తప్పుడుదని తెలిసినా ప్రచారానికి జనం పడిపోతారు" అంది శ్రీమతి.

విషయాన్ని ఆమె బాగా అర్థం చేసుకుంది.

రాలెక్ లూయిజీని నాకు సహాయకుడిగా ఇవ్వడాన్ని నా అదృష్టంగా చెప్పుకున్నాను.

అదీకాక లూయిజీకి కంప్యూటర్ను వాడకంలో కొంత పరిజ్ఞానముంది. అప్పట్లో కంప్యూటరంటే ఒక గది పట్టేటంత ఉండేది. దానికి ప్రత్యేకంగా ఓ ఆపరేటర్ ఉండేవాడు. మన రియాక్షన్సుకి సంబంధించిన ఈక్వేషన్సుని ఆపరేటరు వద్దకి తీసుకెడితే- అతడో ప్రోగ్రాం రాసిస్తాడు. ఆ ప్రోగ్రాంకి అనుగుణంగా డేటాని కంప్యూటర్లోకి ఎక్కించాలి.

లెక్కల్లో ప్రవేశమున్న ఎవరికైనా- అది సృజనాత్మకత అవసరం లేని అవగాహన అని నాకు తెలియదు. అదో బ్రహ్మవిద్య అనుకునేవాణ్ణి.

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నాకు రాదనీ, అది లూయిజీకి వచ్చుననీ- అందువల్ల నా ప్రాజెక్టు వర్క్ మరింత సులభమౌతుందనీ- లూయిజీతో పాటు చాలామంది వద్ద అనేవాణ్ణి.

దాంతో లూయిజీ- నాకోసం తను శ్రమ పడుతున్నాననుకున్నాడు. నా యూరప్ ట్రిప్పు ప్రతిపాదన వినేదాకా అతడలాగే అనుకున్నాడు. అప్పుడు తెలిసిందతడికి- నిజానికి అతడికోసం నేను అనవసరమైనా శ్రమ పడుతున్నానని!

అది గ్రహించిన శ్రీమతి అతడి కళ్లు తెరిపించడానికి యూరప్ ట్రిప్పు ప్రతిపాదించింది తప్ప- తను ఎప్పుడో బెర్లిన్‌తోనే సరిపెట్టుకుంది.

అప్పట్నించీ లూయిజీ నాపట్ల కృతజ్ఞతాభావంతో ప్రవర్తించడం మొదలెట్టాడు.

నేను మాత్రం- లూయిజీ నావల్ల లాభం పొందుతున్నాడన్న భ్రమకు గురి కాలేదు. ఎందుకంటే అతడి కారణంగా నా ప్రాజెక్టు విలువ పెరుగుతున్న మాట కూడా నిజం. నా ఒక్కడివల్ల అంత పని కాదు.

ఎటొచ్చీ గతంలోలా అతణ్ణి మరీ ఎక్కువ పొగడ్డం తగ్గించాను. అతివినయం ధూర్తలక్షణమౌనో కాదో కానీ- ఎదుటివాళ్లని ధూర్తులుగా మార్చే అవకాశం కూడా ఉన్నదనడానికి ఇదో ఉదాహరణ.

ఏది ఏమైనా ఆ తర్వాత- లూయిజీ, నేనూ అక్కడ సమిష్టిగా, ఇష్టులుగా ఎంత కృషి చేశామంటే- ఇద్దరం క్రిస్మస్ రోజుల్లో కూడా లేబరేటరీకి వెళ్లి పరిశోధనలు కొనసాగించాం. నేను నా ప్రయాణం ఒకటి రెండు రోజులుందనగా కూడా లేబ్‌కి వెళ్లాను.

మా ఇద్దరిమధ్యా ఈ సయోధ్యకు కారణమైన శ్రీమతి విషయం కూడా నేనెక్కువ ఆలోచించలేదు. ఎందుకంటే- తను యూరప్ ట్రిప్పు నిజంగా లూయిజీని మార్చడానికి ప్రతిపాదించిందా? లేక ఊహించని విధంగా లూయిజీలో మార్పు రావడంవల్ల తనకేమీ నిరుత్సాహం కలగలేదని నన్ను నమ్మించడానికి ప్రయత్నించిందా అన్న అనుమానం రావచ్చు.

అది నాకిష్టం లేదు.

నా కెటలిస్టుల వ్యవహారం ఇలాగుంటే- మా తిరుగు ప్రయాణం దగ్గరపడుతోంది. ఇప్పటివాళ్లకు అర్థంకాని విశేషాలతో- అదో పెద్ద హడావుడి.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments